
సాక్షి
పల్నాడు
మంగళవారం ; 5 ; డిసెంబర్ ; 2023



ఘంటసాలకు నివాళి


భట్టిప్రోలు: ఘంటసాల 101వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి సోమవారం వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 522.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

శాంతి కల్యాణం



పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైద్యసిబ్బందికి సెలవులు రద్దు

డీఎంహెచ్ఓ అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: తుఫాన్ నేపథ్యంలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. సోమవారం ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు. వైద్యులు, వైద్య సిబ్బందికి సాధారణ సెలవులు రద్దు చేస్తున్నామన్నారు. అత్యవసరమైతే తప్ప సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ కేసులను గుర్తించాలన్నారు. ఈవారంలో ప్రసవమయ్యే గర్భిణులను సమీపంలోని జిల్లా ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రం, గుంటూరు జీజీహెచ్‌లో అడ్మిట్ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పదిరోజుల్లో 285 మంది ప్రసవమయ్యే అవకాశం ఉందని, వారందరినీ తక్షణమే సమీపంలోని ఆస్పత్రుల్లో అడ్మిట్ చేయాలని చెప్పారు. హైరిస్క్ గర్భిణులు జిల్లాలో 24 మంది ఉన్నారని, వీరిలో ఇప్పటికే తొమ్మిది మందిని ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసినట్టు వెల్లడించారు. అన్నిరకాల ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట: రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే ధాన్యం కొంటామని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ధాన్యం కమిటీ సమీక్ష నిర్వహించారు. 2023–24 ఖరీఫ్‌లో 284 ఆర్‌బీకేల పరిధిలో 26,796 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. 66,429 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. దీనిలో 2,200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 మద్దతు ధర ప్రకటించినట్టు చెప్పారు. సమావేశంలో ఆర్డీఓలు ఎం.శేషిరెడ్డి, రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి పద్మశ్రీ, మేనేజర్ మహాలక్ష్మి, నిర్వాహకులు పాల్గొన్నారు.

సాయుధ దళ కుటుంబాల సంక్షేమానికి కృషి



నరసరావుపేట: దేశరక్షణకు నిరంతర సేవలు అందజేసి యుద్ధంలో మృతిచెందిన, ఉద్యోగ విరమణ చేసిన సాయుధ దళ సభ్యుల కుటుంబాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డేకు సంబంధించిన పోస్టర్, కార్ ఫ్లాగ్స్, పతాక స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఏటా డిసెంబరు ఏడున సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. దీనికి విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఆర్.గుణశీల, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ పది మందికి గాయాలు

నరసరావుపేట రూరల్: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, మరో ప్రైవేటు బస్సును ఢీకొనటంతో పదిమంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైన ఘటన సోమవారం రాత్రి గుంటూరు–కర్నూలు రహదారిపై పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద చోటుచేసుకుంది. వినుకొండ నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెట్లూరివారిపాలెం గ్రామం వద్దకు రాగానే నరసరావుపేట మీదుగా బెంగళూరుకు వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ఘటనలో వినుకొండ డిపోలో టీఐ–2గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి చేతికి తీవ్ర గాయం కాగా మరో తొమ్మిది మంది ముఖంపై గాయాలయ్యాయి. గాయపడిన వారిని లింగంగుంట్ల కాలనీలోని 200 పడకల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేశారు. రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,500, గరిష్ట ధర రూ.3,800, మోడల్ ధర రూ.3,200 వరకు పలికింది.

29,359 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 29,359 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 24,619 బస్తాల అమ్మకాలు జరిగాయి.



చీరాల మండలం కఠారివారిపాలెంలో అల్లకల్లోలంగా కడలి

అల వక.. బెదరక

అధికార యంత్రాంగం అప్రమత్తం

- అల్లకల్లోలంగా కడలి
- ఈదురుగాలులు, ఓ మోస్తరు వాన
- అధికారులతో కలెక్టర్ సమీక్ష
- తీరప్రాంతాల్లో పర్యటన
- నేడూ పాఠశాలలకు సెలవు
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- తీరప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు



వాడరేవు తీరాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్, ఆర్డీఓ సరోజిని

బాపట్ల/నిజాంపట్నం/చీరాల టౌన్/వేటపాలెం: మిచాంగ్ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారయంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. తుఫాన్ ప్రభావంతో సోమవారం రెండు జిల్లాల అంతటా ఈదురుగాలలతోపాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. ఫలితంగా కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వరిచేలు నేలకొరిగాయి. బాపట్ల జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ చీరాల వాడరేవు తీరాన్ని పరిశీలించారు. స్థానిక అధికారులు, ప్రజలతో మాట్లాడారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ముందస్తుగా వాడరేవుకు 40 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని తరలించామని పేర్కొన్నారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆహారం, మంచినీరు, ఇతర వసతులు కల్పించినట్టు వెల్లడించారు. మత్స్యకారులు ఎవరూ ఈనెల 23 వరకు వేటకు వెళ్లకూడదని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట ఆర్డీఓ పి.సరోజిని, తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ నేతాజీ, రూరల్ సీఐ సోమశేఖర్, టౌన్ సీఐ శేషగిరిరావు, మెరైన్ ఎస్సై సుబ్బారావు, హౌసింగ్ ఈఏ శ్రీనివాసులు, ఆర్ఐలు శేఖర్, అర్జున్, ఎఫ్‌డీవో రాజ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతాధికారులతో కలెక్టర్ సమీక్ష

జిల్లా ఉన్నతాధికారులతో బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా సోమవారం తన చాంబర్లో సమీక్ష నిర్వహించారు. అత్యవసరంగా 14 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 800 మందికి ఆశ్రయం కల్పించామని వెల్లడించారు. 18 మంది గర్భిణులను వైద్యశాలలకు తరలించామని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను యుద్ధప్రాతిపదికన పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. 43 తుఫాన్ షెల్టర్లు సిద్ధం చేసినట్టు వివరించారు. బాపట్ల జిల్లాకు ఎన్డీఆర్ఎఫ్(నేషనల్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్), ఎస్డీఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్) బృందాలు మొత్తం 50 వచ్చాయని, వీటిని నిజాంపట్నం, వేటపాలెం, రేపల్లెలో సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. 350 మంది ఈతగాళ్లు, 206 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పంటల నష్ట తీవ్రతను తగ్గించే ఏర్పాట్లను వ్యవసాయ అధికారులు చేపట్టాలని సూచించారు. 258 గ్రామాలలో పోలీస్ బృందాలను అందుబాటులో ఉంచినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ కలెక్టర్‌కు వివరించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి రెస్క్యూ చేపట్టేలా ప్రణాళిక రూపొందించుకున్నామని వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, అదనపు ఎస్పీ పి.మహేష్, డీఆర్వో పి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వాలుతున్న చేలు

ఈదురుగాలులతో అక్కడక్కడ చేలు వాలుతున్నాయి. దీంతో రైతుల్లో వణుకు మొదలైంది. సాధ్యమైనంత వరకు నష్టతీవ్రతను తగ్గించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వ్యవసాయ, ఉద్యానశాఖల అధికారులు గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉన్నారు. టార్పాలిన్ పట్టాలను సిద్ధం చేశారు.

తీరప్రాంతంలో కలెక్టర్ పర్యటన



సూర్యలంక వద్ద పునరావాసకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి

కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ ఎమ్మెల్యే కోన రఘుపతితో కలిసి సూర్యలంక తీర ప్రాంతంలో సోమవారం పర్యటించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. బాపట్ల జిల్లాకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం అధికారి బబ్లు బిశ్వాస్‌తో మాట్లాడారు. అనంతరం పునరావాస కేంద్రాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం సమీక్షిస్తున్నారని, ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా తట్టుకునేలా ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

10వ నంబర్ ప్రమాద సూచిక

నిజాంపట్నం హార్బర్‌లో పదో నంబర్ ప్రమాద సూచికను అధికారులు ఎగురవేశారు. నిజాంపట్నం మండలంలో దిండి పంచాయతీ జంపనివారిపాలెం స్కూల్లో, కొత్తపాలెం పంచాయతీ సంజీవనగర్, నక్షత్ర నగర్, పాతూరు గ్రామాల్లో మొత్తం ఐదుచోట్ల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ నెహ్రూబాబు తెలిపారు.

ప్రతి కుటుంబానికి రూ.2,500 నగదు..



వేటపాలెం మండలం కఠారివారిపాలెం తుఫాన్ షెల్టర్‌లో భోజనం చేస్తున్న మత్స్యకారులు

కఠారివారిపాలెంలోని తుఫాన్ షెల్టర్‌ని జేసీ, ఆర్డీఓ పరిశీలించారు. తుఫాన్ షెల్టర్‌కి వచ్చిన ప్రతి కుటుంబానికీ రూ.2,500 ఇవ్వాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలకు నిత్యాసరాలు అందజేయాలని సూచించారు. రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, ఊటు కూరి సుబ్బయ్యపాలెం, రామచంద్రాపురం తీరప్రాంత గ్రామాల ప్రజల కోసం ఆరు షెల్టర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. కఠారివారిపాలెం శివారులో 20 ఎస్టీ కుటుంబాలను పునరావాసానికి తరలించామని జేసీ చెప్పారు.



కొల్లూరు సమీపంలో నీటిలో వరి పనలు

త్రికోటేశ్వరా నమో..


నరసరావుపేట రూరల్: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారుజామున స్వామికి విశేష అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు నిర్వహించిన అనంతరం భక్తులను స్వామిని దర్శించుకునేందుకు అనుమతించారు. ఆలయాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి తుఫాన్ వల్ల చిరు జల్లులు కురుస్తున్నా భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయం వెనక భాగాన రావి చెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విశేషాలంకారంలో అమరేశ్వరుడు

అమరావతి: అమరావతి క్షేత్రంలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక సోమవారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. వేకువనే భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వేమూరి గోపీనాథశర్మ భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత అన్నదానం, ఉచిత ప్రసాదం అందజేశారు. పర్యాటకులతో మ్యూజియం, ధ్యానబుద్ధ ప్రాజెక్టు, సాయి మందిరం కూడా కళకళలాడాయి.



విశేషాలంకారంలో అమరేశ్వరుడు



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి

సూపర్ మార్కెట్ గిడ్డంగిలో అగ్నిప్రమాదం

రూ.3 కోట్లకుపైగా ఆస్తినష్టం!

నరసరావుపేట రూరల్: చిలకలూరిపేట రోడ్డులోని ఛరిష్మా సూపర్ మార్కెట్ గిడ్డంగిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. రూ.3 కోట్లకుపైగా ఆస్తినష్టం వాటిల్లినట్టు వ్యాపారి తెలిపారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి నుంచి వచ్చిన అగ్నిమాపక వాహనాలతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఛరిష్మా సూపర్ మార్కెట్ పేరుతో ఐదు శాఖలు నడుస్తున్నాయి. పట్టణంతోపాటు చిలకలూరిపేట, సత్తెనపల్లి, ఫిరంగిపురంలో బ్రాంచీలు ఉన్నాయి. చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన గిడ్డంగి నుంచి శాఖలకు నిత్యావసర సరుకులు సరఫరా చేస్తుంటారు. సోమవారం తెల్లవారుజామున ఈ గిడ్డంగి నుంచి పొగ బయటకు రావడంతో సెక్యూరిటీ సిబ్బంది గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేసింది. గిడ్డంగిలో నిల్వలు ఉండటంతోపాటు మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో చిలకలూరిపేట, సత్తెనపల్లి నుంచి అదనపు అగ్నిమాపక శకటాలను రప్పించి మంటలను అదుపు చేశారు. ఫైర్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు కృషిచేశారు.



పూర్తిగా దగ్ధమైన సూపర్ మార్కెట్

కారణం అర్థం కావట్లేదు

అగ్నిప్రమాదం ఎలా జరిగిందో అర్థం కావడం లేదని ఛరిష్మా సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ ఏలూరి నాగేశ్వరరావు తెలిపారు. భద్రత పరంగా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామని, ప్రమాదంలో ఎలా జరిగిందో తెలియట్లేదని, దాదాపు రూ.3 కోట్లకు పైగా ఆస్తినష్టం జరిగిందని వివరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నట్టు ఫైర్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంపై సూపర్ మార్కెట్ నిర్వాహకుడు నాగేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ రమణానాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- టీజేపీఎస్ కళాశాలలో ఏఎన్‌యూ అంతర కళాశాలల మెన్స్ వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏఎన్‌యూ అంతర్ కళాశాలల మెన్స్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే గిరిధర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో తప్పనిసరిగా పాల్గొనడం ద్వారా శారీరకంగా, ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, మానసికంగా దృఢంగా తయారవుతారని చెప్పారు. అదేవిధంగా ఇటువంటి పోటీలు ప్రతి క్రీడాకారుడికి ఎన్నో అవకాశాలను కల్పిస్తాయని, క్రీడలను ఉపయోగించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని అన్నారు. ఏఎన్‌యూ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్ మాట్లాడుతూ యువ క్రీడాకారులు టోర్నమెంట్‌లో ప్రతిభా పాటవాలు చూపడం ద్వారా విశ్వవిద్యాలయ స్థాయిలో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆదేవిధంగా ఎదగాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్ది, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే కళాశాల లక్ష్యమన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా విద్యార్థులకు క్రీడాకోటాలో ఉద్యోగాలను అందిపుచ్చుకోగలరని చెప్పారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు జాతీయ జెండాకు వందనం చేసి, మార్చ్ ఫాస్టింగ్ చేశారు. కాగా టోర్నమెంట్ మంగళ, బుధవారాల్లో కొనసాగునుంది. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి వి.కృష్ణానంద్, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.వెంకటేశ్వరరావు, ఏఎన్‌యూ పూర్వ వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య వై.కిషోర్, జాతీయ వాలీబాల్ జట్టుకు కెప్టెన్‌గా చేసిన జాగర్లమూడి సింగారావు, ఎస్.నిరంజన్, వ్యాయామ అధ్యాపకులు, కోచ్‌లు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలకు వెంటనే పరిష్కారం

'జగనన్నకు చెబుదాం'లో 65 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: జగనన్నకు చెబుదాం (స్పందన)కు వచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అధ్యక్షత వహించి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, పులిచింతల ప్రాజెక్ట్ ప్రత్యేక కలెక్టర్ వసంతబాబుతో కలిసి 65 అర్జీలను స్వీకరించారు. అర్జీలు ఇచ్చిన లబ్ధిదారులు సమస్యలు వెంటనే పరిష్కరించి వారికి సమాచారం ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా దాతలు ప్రజల సౌకర్యార్థం భోజనాలను ఏర్పాటు చేశారు. దాతలకు కలెక్టరేట్ సిబ్బంది అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.



సమస్య వింటున్న కలెక్టర్ శివశంకర్

అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంది

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా
- తుఫాన్ నేపథ్యంలో అధికారులతో సమీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలు అధైర్యపడొద్దని, అండగా నిలిచి అన్నివిధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. తుఫాన్ దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల అధికార యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ఆమె సోమవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. తీర ప్రాంతం వెంబడి ఉన్న గ్రామాల్లో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారని, అత్యవసర ఖర్చుల కోసం జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు లేనివిధంగా కేవలం ఆంధ్రప్రదేశ్‌కే ఉన్న అతిపెద్ద సైన్యమైన గ్రామ వలంటీర్ల వ్యవస్థ ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తుఫాన్ కారణంగా గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి సహాయం కావాలన్నా సమీపంలోని గ్రామ సచివాలయంతో పాటు వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు అవకాశం లేని వారితోపాటు షెల్టర్లకు వెళ్లిన ఒక్కో కుటుంబానికి గతంలో మాదిరిగా రూ.2,500 ఇవ్వాలని సీఎం సూచించినట్లు చెప్పారు. అదేవిధంగా ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, ఆయిల్‌పామ్, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు కిలో చొప్పున అందించే ఏర్పాట్లు చేశారని వివరించారు.

రైల్వే కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్

- ఈనెల 4నుంచి 7వ తేదీ వరకు నిర్వహణ
- డీసీఎం కమలాకర్‌బాబు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డివిజన్ డీసీఎం కమలాకర్‌బాబు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఈనెల 4వ నుంచి 7వ తేదీ వరకు అమరావతి బెంచ్ గుంటూరు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు డివిజన్ డీసీఎం కమలాకర్‌బాబు చెప్పారు. స్థానిక అరండల్‌పేటలోని గుంటూరు రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి కోర్టులో సోమవారం రైల్వే కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాదాల బాధితులకు, రవాణాలో వస్తువులు పోగొట్టుకున్న, పాడైపోయిన వారికి త్వరితగతిన పరిహారం చెల్లించడం ద్వారా రైలు వినియోగదారులకు ఉపశమనం కలిగించడం ఈ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. నాలుగు రోజుల వ్యవధిలో 113 కేసులను పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. లోక్ అదాలత్ బెంచ్‌ను న్యాయమూర్తి సత్యభామ నిర్వహించనున్నారన్నారు. ప్రైవేట్ రైల్వే అడ్మినిస్ట్రేషన్ ద్వారా న్యాయమైన పరిహారం కోసం పరస్పరం అంగీకారంతో ఈ 113 కేసుల దరఖాస్తుదారులు పరిహారం పొందేందుకు అర్హులని లోక్ అదాలత్ బెంచ్ సభ్యుడు జి.జాన్ ప్రసాద్ తెలిపారు. అనంతరం లోక్ అదాలత్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు.

క్లుప్తంగా

ఘనంగా ఘంటసాల జయంతి



నరసరావుపేటఈస్ట్: పల్నాడు బస్టాండ్ సమీపంలోని పల్నాడు కళాక్షేత్రంలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ కార్యక్రమంలో పాల్గొని ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమర గాయకునిగా ఘంటసాల సంగీత ప్రపంచానికి అందించిన సేవలను కొనియాడారు. పట్టణానికి చెందిన గాయకులు ఘంటసాల ఆలపించిన పాటలు పాడి అలరించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జూడో సబ్‌జూనియర్ జట్టు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో పల్నాడు జిల్లా సబ్ జూనియర్ జూడో జట్టును ఎంపిక చేసినట్టు జూడో అసోసియేషన్ కార్యదర్శి జి.సాయిరామ్ సోమవారం తెలిపారు. బాలుర జట్టులో వివిధ విభాగాలలో పి.రమేష్, కె.శ్రీనివాసరావు, జి.కుశాల్, టి.సాకేత్, జి.అభిషేక్‌లారెన్స్, ఆర్.సురేంద్ర, టి.ఫణి, కె.మహేష్, జి.దిలీప్ ఎంపికయ్యారు. బాలికల విభాగాలలో బి.ప్రియ, ఎస్.అమ్ములు, బి.వర్షిని, జి.సుష్మ, కె.సుబ్బలక్ష్మి, టి.హారిక, ఎన్.మధుమతి ఎంపికయ్యారు. ఎంపిక కమిటీ సభ్యులుగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పి.సునీత, ఉపాధ్యక్షుడు ఓ.శివకృష్ణ, పరిశీలకునిగా అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాంబాబు వ్యవహరించారు. ఎంపికైన జట్టు క్రీడాకారులు ఈనెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ జూడో ఛాంపియన్‌షిప్ పోటీలలో పల్నాడుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

లబ్ధిదారులకు రెండు వాహనాలు అందజేత

నరసరావుపేట: నవోదయంలో తమకు ఉపాధి కల్పించాలని ధరఖాస్తు చేసుకున్న ఇద్దరు వ్యక్తులకు జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన రూ.36లక్షల విలువైన రెండు వాహనాలను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. ప్రతినెలా 14వ తేదీన కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీలకు అభ్యున్నతికై నవోదయం నిర్వహిస్తున్న విషయం విదితమే. దీనిలో దరఖాస్తు చేసుకున్న క్రోసూరు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన ఏకోలు రతన్ బాబుకు 45శాతం సబ్సిడీపై గుంటూరు కోటక్ మహేంద్ర బ్యాంకు సౌజన్యంతో జగనన్న బడుగు వికాసం కింద రూ.10లక్షలు విలువైన బడా దోస్త్ వాహనం అందజేశారు. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువుకు చెందిన దర్శి మనీష్‌కు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అందజేసిన రుణంతో జగనన్న బడుగు వికాసం కింద రూ.26లక్షల విలువైన ఇన్నోవా వాహనం అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఓబులనాయుడు, నవోదయం కో–ఆర్డినేటర్ సంజీవరావు, ఎల్‌డీఎం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు వాహనాల తాళాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఈశ్వరరావు

చెరుకుపల్లి: అనుమతులు లేకుండా ఎరువులు, పురుగుమందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కే.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని మెట్టగౌడపాలెం గ్రామంలో పలు ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించి మాట్లాడారు. దుకాణాలలో ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లు పొందిన వారు మాత్రమే ఎరువుల దుకాణాలు నిర్వహించాలన్నారు.

ఎరువుల దుకాణాలలో నిర్వహించే లావాదేవీలను రికార్డులలో పొందుపరచాలని, కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదులు అందజేయాలని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. గ్రామంలో తనిఖీలు నిర్వహించగా ఎనుముల నాగరాజు అనే వ్యక్తి ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా ఎరువులు దుకాణం నడుపుతున్నట్లు గుర్తించామన్నారు. నాగరాజుపై కేసులు నమోదు చేయటం జరిగిందని రూ.1,26,536 విలువైన 34.35 లీటర్ల పురుగుమందులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కే.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ

ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్య

మంగళగిరి: ఎస్సీ వర్గీకరణే మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి లక్ష్యమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య స్పష్టం చేశారు. సోమవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎనిమిదేళ్ల కిందట నాగార్జున యూనివర్సిటీ దగ్గర మాదిగ కురుక్షేత్ర మహాసభకు హాజరైన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలపై ఆనాటి టీడీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేసిందన్నారు. కేసుల విషయమై ఇటీవల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఎత్తేయాలని కోరాగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా 30 ఏళ్లుగా అనేక మంది నాయకులు, కార్యకర్తలు తమ ప్రాణాలను పణంగా పెట్టి జాతి కోసం అమరులయ్యారని గుర్తుచేశారు. గత కురుక్షేత మహాసభ గాయాలు మానకముందే మరోసారి ఏపీలో కురుక్షేత్రం పేరుతో మళ్లీ మాదిగల జీవితాలను అంధకారం వైపు తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్న నాయకుడిని మాదిగ జాతి గుర్తించి అప్రమత్తం కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కో–కన్వీనర్లు ఏటుకూరి విజయ్, కొదమల కుమార్, మానికొండ శ్రీధర్, పరసా రామయ్య, రాష్ట్ర యు వసేన అధ్యక్షుడు పొన్నిగంటి రమేష్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొమురాల శ్రీనివాస్, చింతపల్లి గంగాధర్, చింతపల్లి నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మయ్య

మిచాంగ్ ముసురు

- తుఫాన్ ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు
- అప్రమత్తమైన అధికారయంత్రాంగం
- నేడూ విద్యాసంస్థలకు సెలవు
- కోత దశలో ఉన్న వరి, పత్తికి నష్టమే
- నీటిఎద్దడి ఎదుర్కొంటున్న మిరప పొలాలకు మేలే
- రైతులకు అందుబాటులో వ్యవసాయ, ఉద్యాన అధికారులు



నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో మిర్చి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బెన్నీ

సాక్షి, నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. రోజంతా చిరు జల్లులు పడుతునే ఉండటంతో చల్లటి గాలులతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. బాపట్ల, కృష్ణా జిల్లాల మధ్య మంగళవారం తుఫాన్ తీరం దాటనున్న నేపథ్యంలో పల్నాడు జిల్లాలో మరింతగా భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈనేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి జిల్లాలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మంగళవారమూ సెలవు ఇవ్వాలని ఆదేశించింది. లోతట్టు ప్రాంతాలు, కాలువల సమీపంలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికార యంత్రాంగం సూచించింది.

రైతుల్లో కొంత మోదం.. కొంత ఖేదం

పల్నాడు ప్రాంతంలో ఈ ఏడాది కొంత వర్షపాతం తక్కువగా ఉండటం, సాగర్ కాలువల్లో నీటి లభ్యత లేకపోవడంతో పంటలకు నీటి ఎద్దడి నెలకొంది. ఈ నేపథ్యంలో వర్షాలు పడుతుండటం మిర్చి రైతులకు ఎంతో ఊరటనిస్తోంది. రబీలో సాగు మందగించిన నేపథ్యంలో ఈ వర్షాల వల్ల విస్తీర్ణం పెరిగే ఆస్కారం ఉందనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా శనగ, మినుముల పంట సాగుకు అవకాశం ఉంది. పత్తి రెండో విడత కాపు రావడానికి ఈ వర్షాలు మేలు చేయన్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 51,150 హెక్టార్లలో మిర్చి పంట సాగైంది. వీటికి వర్షాలు రావడం ఎంతో ఉపశమనంగా ఉంది.

కోత దశలో ఉంటే మిర్చికీ కన్నీరే

కోతకు వచ్చిన మిర్చి పంట మాత్రం మరో రెండు రోజులు వర్షాలు కొనసాగితే రంగుమారే ప్రమాదముందని తెలుస్తోంది. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బెన్నీ తెలిపారు. వర్షాలు ఆగిన వెంటనే 19:9:19 లేదా 13:0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేసుకోవాలన్నారు. అంతర సేద్యం చేసి నేల త్వరగా ఆరేటట్లు చేసుకోవాలన్నారు. పొలంలో నీరు నిలబడితే ఎండు తెగులు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్నది కనుక నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ : 3 గ్రా / లీ నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. బాక్టీరియా ఆకు మచ్చ, కానోఫారా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం వుంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రా / లీ కు మరియు 0.1గ్రా / లీ స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసి వ్యాప్తిని అరికట్టాలని రైతులకు సూచించారు.

వరికి, పత్తికి ఇబ్బందే

కోతకు వచ్చిన వరి, పత్తి పంటలకు వర్షాలు నష్టం చేకూరుస్తాయని అధికారులు చెబుతున్నారు. వరి చేను పడిపోయి నీట మునిగితే, బూజు తెగులు సోకి గింజ రంగు మారే ప్రమాదం ఉంది. అందుకే రైతులు నీరు వెంటనే బయటకు వెళ్లేలా చూసుకోవాలని అధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1 మి.లీ ప్రొపికోనజోల్ లేదా 1 గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బండిజం ప్లస్ మంకోజెబ్ చొప్పున కలిపి పిచికారీచేసుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఐ.మురళి సూచించారు. వీలునుబట్టి కోతను కొన్ని రోజులు వాయిదా వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 10,800 హెక్టార్లలో వరి సాగు చేయగా ఇప్పటికే 2 వేల హెక్టార్ల సాగు పూర్తైంది. నూర్చిన ధాన్యం 2 నుంచి 3 రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే కుప్పలలో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక కింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పును, 20 కిలోల పొడి ఊక లేదా 4 కిలోల వరి గడ్డితో కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజమొలకెత్తి చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తర్వాత ధాన్యాన్ని ఎండ బోసి, తూర్పారబెట్టి నిలువ చేసుకోవాలన్నారు.

అమరేశ్వరుని దర్శించుకున్న హైకోర్టు జస్టిస్ వేణుగోపాలరావు



జస్టిస్ వేణుగోపాలరావుకి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలో వేంచేసి ఉన్న బాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాలరావు దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ, అర్చకులు హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాలరావు దంపతులకు స్వాగతం పలికి స్వామికి అభిషేకం, బాలచాముండేశ్వరీ దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ వేణు గోపాలరావు దంపతులకు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం

- ప్రాణ, ఆస్తినష్టం లేకుండా చూడాలి
- అధికారులకు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సూచన



తెనాలి: నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మిచాంగ్ తుఫాన్‌గా మారింది. మంగళవారం ఉదయం బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉన్నందున కురిసే భారీ వర్షాలు, వీచే గాలులకు తెనాలి డివిజనులో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ వెల్లడించారు. అన్ని ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా తగిన జాగ్రత్తలతో ఉండాలని తెలియజేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడారు. మిచాంగ్ తుఫాన్ ముంచుకొస్తున్న తరుణంలో ప్రభుత్వపరంగా అన్నిరకాల చర్యలు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. ఆరోగ్యశాఖ, మున్సిపాలిటీ యంత్రాంగం, పోలీస్ శాఖ, ఆర్‌అండ్‌బీ, విద్యుత్, అగ్నిమాపక విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. అన్ని విభాగాల వారు ఇప్పటికే అప్రమత్తంగా ఉన్నారని చెప్పారు. పొరుగు జిల్లా కేంద్రం బాపట్ల సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున ఇక్కడ సైతం భారీవర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు, రైతులు అధికారుల సూచనలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్, కంట్రోలు రూమ్‌ను ఏర్పాటుచేశామని చెప్పారు. ప్రజలు ఎవరికైనా సమస్య ఏర్పడితే 9866671291 కంట్రోలు రూమ్ నంబరును సంప్రదించాలని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ సూచించారు.

బస్సు దగ్ధం ఘటనలో చీరాల ప్రయాణికులు సేఫ్

చీరాలఅర్బన్: హైదరాబాద్ నుంచి చీరాల వస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు సోమవారం తెల్లవారుజామున నల్గొండ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఇంజిన్‌లో మంటలు వ్యాపించి వెంటనే బస్సు మొత్తం దగ్ధమైంది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరిని దింపివేశారు. అయితే ఈఘటనలో ఒకరు బస్సులో ఉండిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అయితే మృతి చెందిన వ్యక్తి ఎవరనేది స్పష్టత రాలేదు. చివరకు మృతిచెందిన వ్యక్తి చీరాలకు చెందిన వారు కాకపోవడంతో చీరాల ప్రయాణికులు సేఫ్‌గా ఉన్నారు.దీంతో ప్రయాణికుల బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

సీపెట్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి కల్పన

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ) సహకారంతో టెన్త్‌లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్ అసిస్టెంట్ – ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ కల్పించి, సర్టిఫికెట్ అందజేస్తామని వివరించారు. శిక్షణానంతరం అనంతపురం, హైదరాబాద్ బెంగళూరు, హోసూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ట్రైనింగ్ కిట్, యూనిఫాం, సేఫ్టీ షూస్‌ను సీపెట్ అందజేస్తుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతలు, ఆదాయ, సామాజిక వర్గ ధ్రువపత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో తమ ప్రతినిధి బాణావతు అంజినాయక్‌ను 78935 86494 నంబర్‌లో సంప్రదించి, సత్వరమే రిజి స్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఎద్దులు తోలుకెళ్లి డబ్బులు ఇవ్వట్లేదు

- జగనన్నకు చెబుదాంలో 33 ఫిర్యాదులు స్వీకరణ
- సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించిన జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



ఫిర్యాదుదారులు చెబుతున్న సమస్య వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: డబ్బులు ఇస్తానని చెప్పి ఎద్దులు తోలుకొని పోయి మూడు నెలలు గడుస్తున్నా డబ్బులూ ఇవ్వలేదు, ఎద్దులూ తిరిగి ఇవ్వలేదని రెంటచింతలకు చెందిన మేడికొండ రంగారావు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం(స్పందన)కు అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 33 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం, ఆన్‌లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక, ఆస్తి, పొలం, ఆర్థికపరమైన సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందుకున్నారు. రెంటచింతల మండలం పాల్వాయిగేటు గ్రామానికి చెందిన మేడికొండ రంగారావు ఫిర్యాదు చేస్తూ తన వద్ద ఉన్న రెండు ఎద్దులను గురజాల మండలానికి చెందిన వ్యక్తికి రూ.60 వేలకు విక్రయించానన్నారు. ఆ వ్యక్తి బయానా కింద రూ.500 చెల్లించి ఎద్దులను తోలుకొని పోయాడని తెలిపారు. ఇప్పటికి మూడు నెలలు అవుతున్న డబ్బులు ఇవ్వకుండా, ఎద్దులను తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని ఎస్పీని కోరారు. ఈ విధంగా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. తమ సమస్యలు విన్నవించుకోవడానికి విచ్చేసిన ప్రజలకు దాతలు అన్నదానం నిర్వహించారు. డీఎస్పీలు కేవీ మహేష్, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిసి లోను తీసుకుంటే చెల్లించకుండా ఇబ్బందిపెడుతున్నాడు

నా స్నేహితునితో కలిసి వ్యాపారం చేసేందుకు గుంటూరు సెంట్రల్ బ్యాంకులో రూ.75లక్షలు రుణం తీసుకున్నాం. ఆ రుణంలో తాను చెల్లించాల్సిన డబ్బు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నాడు. గట్టిగా అడిగితే ఇంటిమీదకు వచ్చి బెదిరిస్తున్నాడు.

–కళ్లం పేరిరెడ్డి, మానుకొండవారిపాలెం, చిలకలూరిపేట

డబ్బులు తీసుకొని పొలం రిజిస్ట్రేషన్ చేయట్లేదు

మా గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద రూ.10లక్షలకు పొలం కొనేందుకు అడ్వాన్స్‌గా రూ.2.5లక్షలు చెల్లించాను. మిగతా డబ్బులు చెల్లిస్తాను, వచ్చి పొలం రిజిస్ట్రేషన్ చేయమంటే చేయకుండా, తీసుకున్న అడ్వాన్స్ తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడు.

–ఒంటిపులి కొండలు, సత్తెనపల్లి

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

గుంటూరు వెస్ట్: దేశ రక్షణ కోసం సైనికులు చేసే త్యాగాలకు వెలకట్టలేమని జిల్లా కలెకర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ రాజకుమారితో కలిసి సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యుద్ధంలో మరణించిన, ఉద్యోగ విరమణ చేసిన సైనికుల కుటుంబాల సంక్షేమాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం జరుపుకోవడం ఆనావాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమానికి అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ వారికి తోచిన సాయం చేయాలని కోరారు. మరణాన్ని తృణప్రాయంగా భావించే సైనికుల త్యాగా లు ఎంత చెప్పినా తక్కువేనన్నా రు. జిల్లా సైనిక సంక్షేమాధికారి ఆర్. గుణశీల, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో పడి వృద్ధుడు మృతి

కారంచేడు: భార్య మరణాన్ని తట్టుకోలేక మద్యానికి బానిసై ప్రాణాలు కోల్పోయాడు ఓ వృద్ధుడు. కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. కారంచేడు కాలువ సెంటర్ యానాది కాలనీ ప్రాంతంలో నివసించే పొట్లూరి అంకయ్య (65) చేలల్లో ఎలుకలు పట్టుకొని జీవనం సాగించేవాడు. అప్పుడప్పుడు వ్యవసాయ కూలీగా పనిచేసేవాడు. ఈక్రమంలో గతేడాది భార్య మరణించింది. అప్పటినుంచి అంకయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం మద్యం పూటుగా తాగి తూలుతూ కనిపించాడు. ఇది మామూలే అని స్థానికులు పట్టించుకోలేదు. ఒంటరిగానే జీవించే పోలయ్య రాత్రి కారంచేడు–కుంలమర్రు రోడ్డులోని దొంగ తూముల సమీపంలో ఉన్న పంట కాలువ వైపు వెళ్లాడు. రోడ్డుకు ఆనుకొనే ఉన్న పంట కాలువలో కాలు జారి పడి మృతి చెందాడు. ఉదయం పొలాలకు వెళ్లే రైతులు గమనించి విషయాన్ని కాలనీ వాసులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.